ప్రజాశక్తి

శుక్రవారం 3 మార్చి 2023 | 5 | శ్రీకాకుళం





నిరసన తెలుపుతున్న సిపిఎం, సిఐటియు నాయకులు

మూసేయడానికేనా?

జాతీయ విద్యా విధానం పేరుతో ఇప్పటికే ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను కిలోమీటరు పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. తాజాగా 1, 2 తరగతులను నడుస్తున్న ప్రాథమిక పాఠశాలల్లో మరికొన్ని మాయం కాబోతున్నాయి. పది మంది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలను పూర్తి ఎత్తేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు జిల్లాల వారీగా ఈ తరహా పాఠశాలలు ఎన్ని ఉన్నాయో వివరాలు సేకరించాలని ఆదేశాలు జారీ చేశారు. 3, 4, 5 తరగతులను ఏవిధంగా విలీనం చేశారో అదే తరహా మిగిలిన 1, 2 తరగతులనూ ఉన్నత పాఠశాలల్లో కలిపేసి లేదా సమీపంలో ఉన్న మరో పాఠశాలలో విలీనం చేయాలని నిర్ణయించినట్లుగా సమాచారం. అదే జరిగితే వందలాది ప్రాథమిక పాఠశాలలు మూతపడే అవకాశముంది.



- పది మంది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలల వివరాల సేకరణ
- జిల్లాలో 246 పాఠశాలలు గుర్తింపు
- కిలోమీటరు లోపు 66 పాఠశాలలు ఉన్నట్లు తేల్చిన అధికారులు
- గతంలో ఆగిన విలీన పాఠశాల వివరాలనూ కోరిన ప్రభుత్వం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఇదివరకే 224 ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను సమీప పాఠశాలల్లో విలీనం చేశారు. ఆయా పాఠశాలల నుంచి వేలాది మంది విద్యార్థులు కిలోమీటరు దూరంలోని పాఠశాలలకు వెళ్లాల్సి వచ్చింది. మిగిలిన 1, 2 తరగతులను విలీనం చేస్తే పాఠశాల నిర్వహణ ఖర్చుతో పాటు ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పది మంది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలను ఎంపిక చేసుకుని ఆయా విద్యార్థులను సమీప పాఠశాలలో కలపడానికి ప్రభుత్వం సిద్ధమైంది. జిల్లాల పది మంది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలు 246 ఉన్నట్లు జిల్లా విద్యాశాఖ గుర్తించింది. వీటిలో కిలోమీటరులోపు ఉన్న పాఠశాలలు 66 మాత్రమే ఉన్నాయి. వీటిలో కిలోమీటరు లోపు ప్రాథమికోన్నత పాఠశాలలు 22, ఉన్నత పాఠశాలలు 47 వరకు ఉన్నాయి.

ఆ 22 పాఠశాలలూ విలీనమేనా?

2022 విద్యా సంవత్సరంలో పది మంది లోపు ఉన్న 3, 4, 5 తరగతులను కిలోమీటరు పరిధిలో ఉన్న పాఠశాలల్లో విలీనం చేశారు. ఆ విధంగా జిల్లాలో 224 పాఠశాలలకు చెందిన విద్యార్థులను తరలించారు. వాస్తవానికి 246 పాఠశాలల్లోని మూడు నుంచి ఐదో తరగతి వరకు ఉన్న చిన్నారులను పంపేయాలని తొలుత ప్రతిపాదించారు. తల్లిదండ్రుల ఒత్తిళ్లతో ప్రజాప్రతినిధులు చేసిన సిఫార్సులతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. దీంతోపాటు ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యార్థులు నది దాటి వెళ్లడం వంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మరికొన్నింటిని విలీన ప్రతిపాదనల నుంచి విరమించుకుంది. మొత్తం మీద 22 పాఠశాలలు విలీనం కాకుండా ఉన్నాయి. ప్రభుత్వం తాజాగా సేకరిస్తున్న వివరాలతో వాటినీ విలీనం చేస్తారేమోనన్న సందేహాలు అందరిలోనూ నెలకొన్నాయి.

చిన్నారులకు కష్టమే

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నా, ప్రభుత్వం మాత్రం సంస్కరణల అమలుకు వెనుకాడడం లేదు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయినా పాఠశాలలను విలీనం చేసేందుకే ప్రభుత్వం మొగ్గుచూపుతున్నట్లు చెప్తోంది. ట్రాఫిక్ ఇబ్బందులు, దూరంగా ఉన్న పాఠశాలలకు చిన్నారులు నడవలేక ప్రయివేటు పాఠశాలలో చేరిపోయారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులే సమీప పాఠశాలలకు వెళ్లకపోతే 1, 2 తరగతుల చిన్నారులు ఒక కిలోమీటరు దూరంలోని పాఠశాలలకు ఎలా వెళ్తారని ఉపాధ్యాయులు చెప్తున్నారు. ప్రభుత్వం ఒకటి, రెండు తరగతులను విలీనం చేయాలని నిర్ణయిస్తే మాత్రం ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్స్ బాగా పెరుగుతాయని ఉపాధ్యాయులు, విద్యావంతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అంగన్వాడీ కేంద్రాలు మార్పు

ప్రభుత్వం నాడు-నేడు పథకంలో భాగంగా నిధులు కేటాయించి ప్రాథమిక పాఠశాలల భవనాలకు కొత్త హంగులు సమకూర్చింది. ప్రస్తుతం విలీన ప్రతిపాదనల్లో ఉన్న వాటిలో కొన్ని పాఠశాలలు ఆ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. పాఠశాలల భవనాలు వృథా కాకుండా సమీపంలో ఉన్న పాఠశాలల్లో 1, 2 తరగతులను విలీనం చేయనుండడంతో, ఈ పాఠశాల భవనాలు నిరుపయోగంగా మారే అవకాశం ఉంది. ఈ భవనాలను అంగన్వాడీ కేంద్రాలుగా ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం.

పాఠశాలల వివరాలు పంపాం



జిల్లాలో పది మంది లోపు విద్యార్థులున్న పాఠశాలల వివరాలను రాష్ట్రస్థాయి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) అధికారులు అడిగారు. ఒకటి, రెండు తరగతులకు ఒక కిలోమీటరు దూరంలో ఉన్న ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల వివరాలు పంపాలని సూచించారు. జిల్లాలో ఆ విధంగా ఉన్న పాఠశాలలను గుర్తించి ఉన్నతాధికారులకు పంపాం. పాఠశాలలను విలీనం చేస్తారనేది ఎక్కడా చెప్పలేదు. విలీనంపై ఎటువంటి ఉత్తర్వులు, ఆదేశాలు రాలేదు.

- జి.పగడాలమ్మ, జిల్లా విద్యాశాఖాధికారి

సామాన్యులపై కేంద్రం గుది'బండ'

- వంటగ్యాస్ ధరల పెంపును ఉపసంహరించుకోవాలి
- సబ్సిడీని పునరుద్ధరించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వంట గ్యాస్ ధరలను పెంచి ప్రజల నడ్డివిరుస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు విమర్శించారు. గ్యాస్ ధరల పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ ధర 50, వాణిజ్య సిలిండర్ రూ.350 పెంపును వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలో ఖాళీ గ్యాస్ సిలిండర్‌తో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటి సామాన్య ప్రజలు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ ధరలు రెండు నెలల వ్యవధిలో రెండుసార్లు పెంచడం దారుణమన్నారు. 2014లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రూ.417 ఉన్న వంటగ్యాస్ సిలిండర్ ధర నేడు రూ.1155కు పెరిగిందని చెప్పారు. రెండేళ్ల నుంచే సబ్సిడీ జమను ప్రభుత్వం నిలిపివేసిందని తెలిపారు. ఇప్పటికే గృహ వినియోగానికి సబ్సిడీ కింద ఇచ్చే సిలిండర్ల సంఖ్యను కుదించిందన్నారు. ఇది పూర్తిగా పేద, మధ్య తరగతిపై దాడి తప్ప మరొకటి కాదని విమర్శించారు. వాణిజ్య సిలిండర్ ధరను ఒక్కసారిగా రూ.350 పెంచడం వల్ల స్వయం ఉపాధి పొందుతున్న వారు, చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి లేక, వేతనాలు చాలక ద్రవ్యోల్బణం పెరిగిపోతున్న నేపథ్యంలో ధరలు నియంత్రించాల్సిన ప్రభుత్వం మూలిగే నక్కపై తాటి పండులా భారాలు మోపడం దుర్మార్గమన్నారు. ప్రజలపై భారాలు మోపుతూ మరోవైపు కార్పొరేట్లకు రాయితీలిచ్చి దేశాన్ని దోచిపెడుతోందని విమర్శించారు. వంట గ్యాస్ ధరల పెంపును ఉపసంహరించి, సబ్సిడీని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి రమణ, నాయకులు డి.బంగార్రాజు, జి.శ్రీనివాసరావు, ఎన్.రమణ, ఎల్.రాము, బి.రాము, వి.రాజు, ఎం.శివ, డి.రాము తదితరులు పాల్గొన్నారు.

టెక్కలిలో సిపిఐ ధర్నా

టెక్కలి: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచడంపై సిపిఐ కార్యాలయం వద్ద నాయకులు గురువారం ధర్నా చేపట్టారు. గ్యాస్ ధరల పెంపు అన్యాయమని సిపిఐ నాయకులు యడ్ల గోపి, అనపాన షణ్ముఖరావు అన్నారు. కార్యక్రమంలో పాల పోలారావు, తిర్లంగి సత్యం, జోగినాయుడు, ఎస్.రామ్మూర్తి, భాస్కరరావు, వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల మండలి ఎన్నికలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఈనెల 13న నిర్వహించనున్న స్థానిక సంస్థల శాసన మండలి సభ్యుని ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకట్రామన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిటిసి, జెడ్‌పిటిసి సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా నాలుగు పోలింగ్ కేంద్రాలను ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శ్రీకాకుళం ఆర్‌డిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఆమదాలవలస, బూర్జ, ఎచ్చెర్ల, జి.సిగడాం, గార, జలుమూరు, లావేరు, నరసన్నపేట, పోలాకి, పొందూరు రణస్థలం, సరుబుజ్జిలి, శ్రీకాకుళం మండలాల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. పాలకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో పాలకొండ, భామిని, రేగిడి, రాజాం, సంతకవిటి, సీతంపేట, వంగర, వీరఘట్టం మండలాల ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో హిరమండలం, కోటబొమ్మాళి, కొత్తూరు, ఎల్ఎన్‌పేట, మెళియాపుట్టి, పాతపట్నం, సంతబొమ్మాళి, సారవకోట, టెక్కలి మండలాల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని పేర్కొన్నారు. పలాస తహశీల్దార్ కార్యాలయంలో ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట, మందస, పలాస, నందిగాం, వజ్రపుకొత్తూరు మండలాల ఓటర్లు ఓటు వేస్తారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు వీలుందని పేర్కొన్నారు.

ఉద్దానంలో రేపు కిడ్నీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉద్దానం ప్రాంతంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన ఈనెల నాలుగో తేదీన కిడ్నీ వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం, అక్కుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి కిడ్నీ వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం రక్త నమూనాలను సేకరించనున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ సహకారంతో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత నెల 25న మందస మండలం హరిపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్, బట్టిగల్లూరు పిహెచ్‌సి పరిధిలో సుమారు 648 మందికి రక్త పరీక్షలు నిర్వహించి సీరం క్రియాటిన్ లెవల్స్‌ను పరిశీలించినట్టు తెలిపారు. కవిటి మండలం బొరివంక, కంచిలి మండలం తలతంపర, ఈదుపురంలో ఆరోగ్య సదస్సులు నిర్వహించి వెయ్యి మందికి రక్త పరీక్షలు చేపట్టామన్నారు. గోవిందపురం, అక్కుపల్లి కేంద్రాల్లో నిర్వహిస్తున్న వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో సమీప ప్రాంతాల ప్రజలు పాల్గొనాలని కోరారు. ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముందుగానే రక్త పరీక్షలు చేయించుకుంటే వ్యాధిని అదుపులో ఉంచుకోవడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ శిబిరాల్లో నెఫ్రాలజిస్టు, వైద్యులు ఉచితంగా మందులు, వైద్య సలహాలు అందిస్తారని తెలిపారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే కెరీర్‌పై దృష్టి

బిఆర్ఎయు వైస్ ఛాన్సలర్ ఎన్.వెంకటరావు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల



ఇంటర్మీడియట్ తర్వాత చదివే కోర్సులు విద్యార్థుల భవిష్యత్‌ను నిర్దేశిస్తాయని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఎన్.వెంకటరావు అన్నారు. ఆ దశ నుంచే కెరీర్‌పై దృష్టిసారిస్తే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. 2022-23 విద్యా సంవత్సరంలో వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ప్రవేశాలు పొందిన బిటెక్ విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీలో ఏ లక్ష్యంతో ప్రవేశించారో అదే లక్ష్యంతో కోర్సును పూర్తి చేసి నైపుణ్యవంతమైన విద్యార్థిగా సమాజానికి ఉపయోగపడాలని సూచించారు. యూనివర్సిటీలో విద్యార్థులకు అందుబాటులో ఉన్న లైబ్రరీ, ల్యాబ్‌లు, హాస్టల్ తదితర వసతులను సద్వినియోగం చేసుకుని కెరీర్‌కు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. వర్సిటీలో యాంటీ ర్యాగింగ్ చట్టం అమల్లో ఉందని, నిబంధనలను అనుసరించి నడవడిక సాగించాలని చెప్పారు. రిజిస్ట్రార్, ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ సిహెచ్.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సబ్జెక్టులపై పట్టు సాధిస్తేనే కెరీర్‌కు ఉపయోగపడే పలు రంగాల్లో నైపుణ్యత, ప్రవేశం సాధించాలన్నారు. భాషాపరమైన సవాళ్లను అధిగమించాలని, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు డి.ఎస్.ఆర్ మూర్తి, భాస్కరరెడ్డి, ఇంజినీరింగ్ కోర్సులకు సంబంధించి సబ్జెక్టు, కెరీర్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్, ఆర్.శ్రీధర్, కె.స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ గెలుపు.. ఉత్తరాంధ్రకు మలుపు

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల అభ్యర్థులను ఓడించండి
- ఓటర్లకు పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ అభ్యర్థన

ప్రజాశక్తి - పాడేరు



పాడేరులో ప్రచారం చేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

పిడిఎఫ్ గెలుపు.. ఉత్తరాంధ్రకు మలుపు వంటిదని, ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికోసం శాసన మండలి వేదికగా కృషి చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయ రంగు పులుముకోవడం శోచనీయమన్నారు. ఈ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులను ఓడించాలని, విధానాలు, సమస్యలపై నిరంతర పోరాటాలు చేసే పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించడమే విద్యావంతులకు నిజమైన విజయమని పిలుపునిచ్చారు. గురువారం పాడేరు, అరకులోయ ప్రాంతాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా 250 సంఘాల మద్దతుతో తాను పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. పిడిఎఫ్ అభ్యర్థులను ఓడించాలని అధికారమంతా ఉపయోగించి, రాష్ట్ర ప్రభుత్వం అనేక అక్రమాలకు తెరతీసిందన్నారు. అడ్డగోలుగా ఓటర్ల నమోదు చేయించారని, ఎయు విసితోపాటు పలువురు ఎంఇఒలు, ఇతర అధికారులను ప్రత్యక్షంగా ఎన్నికల ప్రచారం చేయించి అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు. కస్తూర్బా ఉద్యోగులను బెదిరించి, సమావేశపరిచి అధికార పార్టీ అభ్యర్థి ప్రచారానికి పూనుకున్నారని విమర్శించారు. అయితే చైతన్యవంతులైనపట్టభద్రుల ఓటర్లందరూ ఇలాంటి బెదిరింపులు, ప్రలోభాలకు లొంగకుండా ఈ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థినైన తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకం వల్ల ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రత్యేక ప్యాకేజీ కింద ఎనిమిదేళ్లలో కేంద్ర ప్రభుత్వం రూ.24 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా, కేవలం రూ.450 కోట్లు మాత్రమే కేటాయించిన కేంద్ర ప్రభుత్వాన్ని అధికార వైసిపితోపాటు ప్రధాన విపక్షం టిడిపి ప్రశ్నించలేకపోయిందన్నారు. విభజన హామీల అమలు, విశాఖ కేంద్రంగా రైల్వేజోన్, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ, గిరిజన ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల కల్పన, సమగ్రాభివృద్ధి వంటిఅంశాల్లో రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేస్తున్నా ప్రశ్నించే పరిస్థితి లేదన్నారు. జిఒ 3 రద్దుతో విద్య, ఉద్యోగాల్లో ఏజెన్సీలోని గిరిజనులకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. గిరిజన ప్రాంతాల అబివృద్ధి, సంక్షేమం, గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో తీరని అన్యాయం చేస్తున్న ప్రభుత్వాల చర్యలపై ప్రశ్నించాలన్నా, పోరాడి హక్కులను సాధించుకోవాలన్నా పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎపి గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స, మెడికల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శెట్టి నాగరాజు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు హరీష్, స్థానిక గిరిజన సంఘం నాయకులు ఎల్ సుందరరావు, బొజ్జన్న ఎస్ఎఫ్ఐ నాయకుడు నరేష్ పాల్గొన్నారు. అనంతరం ఆమె హుకుంపేట, అరకులోయ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం చేపట్టారు.

ఆస్పత్రుల అభివృద్ధికి ప్రాధాన్యం

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

ఆస్పత్రుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని పాత్రునివలసలో గల శ్రీ సాయి డెంటల్ కళాశాలలో ఫాస్ట్‌ట్రాక్ క్లినిక్ రేడియాలజీ విభాగాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని అనుమతులతో సాయి డెంటల్ కళాశాల రీసెర్చ్ స్థాయికి చేరుకోవడం శుభపరిణామన్నారు. ఈ కళాశాలలో పూర్తిస్థాయి ఫ్యాకల్టీ, అవసరమైన ఎక్విప్‌మెంట్ ఉండడంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు ఉచితంగా దంత వైద్య సేవలు అందిస్తోందని చెప్పారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వైద్యం తక్కువగా ఉన్నా, దేశంలో మాత్రం వైద్య సేవలు విస్తృతంగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన నిధులను కేటాయించి ప్రభుత్వాస్పత్రుల్లో సిబ్బంది, మౌలిక సదుపాయాలను ఎప్పటికప్పుడు కల్పిస్తోందని చెప్పారు. అనంతరం కళాశాలకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మధు విలేకర్, కళాశాల ప్రిన్సిపల్ కృష్ణప్రసాద్, కళాశాల కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ గంగరాజు, ఐ.కె రావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు



మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధి హామీ సిబ్బంది అక్రమాలకు పాల్పడినట్టు నిర్ధారణ అయితే నిధులను రికవరీ చేయడంతో పాటు చర్యలు తప్పవని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు హెచ్చరించారు. నగరంలోని డ్వామా కార్యాలయంలో జి.సిగడాం మండల సామాజిక తనిఖీ ప్రజా వేదికను గురువారం నిర్వహించారు. సామాజిక తనిఖీ డిఆర్‌పిలు మండలంలో ఇప్పటివరకు కూలీలకు వేతనాల రూపంలో రూ.11.90 కోట్లు, మెటీరియల్ పనుల నిమిత్తం రూ.2.80 కోట్లు మొత్తం రూ.14.71 కోట్లు వ్యయం చేసినట్లు వెల్లడించారు. చిన్న చిన్న పొరపాట్లు తప్ప మండలంలో ఉపాధి హామీ పనులు సక్రమంగా అమలైనట్లు తెలిపారు. ప్లాంటేషన్ పనులకు సంబంధించి కొన్ని ప్రాంతాల్లో పోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు వేయాల్సి ఉందన్నారు. క్షేత్రస్థాయిలో తమ పరిశీలనలో ఎటువంటి లోటుపాట్లు వెలుగు చూడలేదని చెప్పారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఉపాధి హామీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజా వేదికలో పేర్కొన్న అంశాలపై విచారణ చేసి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. జాబ్‌కార్డు లేని వారిని పనికి రాకుండా చూడాలన్నారు. కూలీల సగటు కూలి పెరిగేలా ఫీల్డ్ అసిస్టెంట్లు దృష్టిసారించాలని ఆదేశించారు. మస్టర్ షీట్లలో ఎటువంటి దిద్దుబాట్లు ఉండకూడదని స్పష్టం చేశారు. వేసవి నేపథ్యంలో ఉదయం, సాయంత్రం చల్లని సమయాల్లో పనులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. విధి నిర్వహణలో చిన్న పొరపాటుకూ ఉద్యోగులు అవకాశం ఇవ్వకూడదని హెచ్చరించారు. విఒఎలు, ఆశావర్కర్లు, వాలంటీర్లు, అంగన్వాడీ సిబ్బంది పేర్లు ఉపాధి పనుల్లో ఉన్నట్లు చూపిస్తే తక్షణమే రికవరీ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రజా వేదికలో ఉపాధి హామీ జిల్లా విజిలెన్స్ అధికారి బి.లవరాజు, ఫైనాన్స్ మేనేజర్ స్వరూపరాణి, ఎపిడి కె.లోకేష్, జి.సిగడాం ఎంపిడిఒ ఎస్.శ్రీనివాసరావు, ఎస్ఆర్‌పి సింహాద్రి, పరిపాలనాధికారి ప్రసాదరావు, ఎపిఒ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో కృషి చేయండి

మెట్‌కోర్ పరిశ్రమను తెరిచేందుకు

సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - టెక్కలి



కార్మికులు, యాజమాన్య ప్రతినిధులతో చర్చిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

మండలంలోని రావివలస మెట్‌కోర్ పరిశ్రమను తెరిచేందుకు కార్మికులు, యాజమాన్యం సమన్వయంతో కృషి చేయాలని సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించి, సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ నేపథ్యంలో 200 మంది ఒప్పంద కార్మికులు బుధవారం విధులు బహిష్కరించారు. 70 మంది రెగ్యులర్ కార్మికులకూ పని లేకపోవడంతో యాజమాన్యం పరిశ్రమను బుధవారం మూసివేసింది. విషయం తెలుసుకున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి గురువారం ఉదయం తన కార్యాలయంలో కార్మికులు, యాజమాన్య ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు ఎ.రామారావు, రామ్మూర్తి, త్రివేణి మాట్లాడుతూ 2015 మేలో లాకౌట్ ప్రకటించడంతో ఏడేళ్లు పరిశ్రమ మూతపడిందని, మళ్లీ 2021 డిసెంబరులో పున: ప్రారంభించారని అన్నారు. పరిశ్రమ యాజమాన్యం దివాళా పేరుతో ఐదేళ్లుగా రావాల్సిన బకాయిలు మంజూరు చేయాలని, ఉద్యోగ విరమణ పొందిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. జీతాలు చెల్లించడంలో జాప్యం వల్ల కార్మిక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. దీనిపై సబ్ కలెక్టర్ మాట్లాడుతూ కార్మిక చట్టం ప్రకారం వేతనాలు అందివ్వాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని, ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, పర్యావరణ పరిరక్షణకు చెట్లను పెంచాలని సూచించారు. కార్మికులు, యాజమాన్యం మరోసారి పరిశ్రమలో చర్చించుకొని సామరస్యపూర్వకంగా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఇరుపక్షాలు సమన్వయం పాటించి పరిశ్రమను తెరిచేందుకు సహకరించాలని సూచించారు. పరిశ్రమ వద్దకు వెళ్లి మరోసారి ఏర్పాట్లను పర్యవేక్షించి, నివేదిక ఇవ్వాలని కార్మికశాఖ, కాలుష్య నియంత్రణ అధికారులను ఆదేశించారు. సమావేశంలో సిపిఎం నాయకులు ఎన్.షణ్ముఖరావు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారి ఎస్.డి.వి ప్రసాదరావు, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ శంకర్ నాయక్, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ జి.వి.ఎస్.నారాయణ, పరిశ్రమ జిఎం సింహాచలం, హెచ్‌ఆర్ ఆర్.భాస్కరరావు, కార్మికులు పాల్గొన్నారు.

ఎంపీ దృష్టికి రైతుల సమస్యలు

ప్రజాశక్తి- బూర్జ


వినతిపత్రం అందజేస్తున్న రాంజీ

మండలంలోని ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు వావిలపల్లి సీతారాం బాబునాయుడు (రాంజీ) కోరారు. శ్రీకాకుళంలోని ఎంపీ కార్యాలయంలో పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడును గురువారం రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి ఇంటిల్లిపాదీ రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసే పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. దీంతో ధాన్యం బస్తాలు కళ్లల్లోనే పడి ఉన్నాయని పేర్కొన్నారు. చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక, ధాన్యం బస్తాలకు కాపులో ఉండలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. రైతుల సమస్యలపై స్పందించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు దీనిపై ఎంపీ స్పందిస్తూ... బూర్జ మండల రైతులు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేస్తానని హామీనిచ్చారు.


పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కబడ్డీలో నౌపడ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రభుత్వ పాఠశాల నుంచి జిల్లా తరపున కబడ్డీ ఆడి గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. చిత్తూరు జిల్లా నగరిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి అండర్-14 కబడ్డీ పోటీల్లో పాఠశాల విద్యార్థులు ఎం.బాలభార్గవ్, కె.శ్రీను, కె.గౌతం జిల్లా తరపున ఆడి ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు డి.శ్యామ్ కాంతారావును, విద్యార్థులను నౌపడ సర్పంచ్ పిలక రవికుమార్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం దాశరథి, ఉపాధ్యాయులు గోపాలకృష్ణ, మోహన్‌రావు, జగన్మోహన్‌రావు, రమేష్‌బాబు, విద్యా కమిటీ చైర్మన్ పిట్ట కోటి అభినందించారు.

పెరటికోళ్ల పెంపకంతో లాభాలు

వజ్రపుకొత్తూరు: పెరటి కోళ్ల పెంపకంతో మహిళలు లాభాలు పొందవచ్చని మండల మహిళా సమైక్య అధ్యక్షులు జల్లు ఉషారాణి అన్నారు. గురువారం పెద్దమురాహరిపురం కాళీమాత ఆలయం సమీపంలో వెలుగు ఎపిఎం జాంబవతి ఆధ్వర్యాన నిర్వహించిన కోళ్ల పంపిణీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను ఆర్థిక పరిపుష్టి వైపు నడిపించే ప్రయత్నంలో భాగంగా తక్కువ ధరలకు ప్రభుత్వం పెరట కోళ్లను అందిస్తుందన్నారు. రూ.3970లకు 13కోళ్లతో పాటు 30 కిలోల దాణా, మందులు అందిస్తున్నామని తెలిపారు. పెరటి కోళ్లు ఎక్కువ గుడ్లు పెడతాయని అన్నారు. మండలంలో ఇప్పటివరకు 96 యూనిట్లు పంపిణీ చేశామని తెలిపారు. మహిళల అభివృద్ధికి మండల సమైక్య అన్ని విధాలా కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సిసి ఉష, సీఫ్ నిర్మల, మహిళలు పాల్గొన్నారు.


కోళ్లను పంపిణీ చేస్తున్న ఉషారాణి

ఉన్నత విద్యకు ప్రాధాన్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడంలో మహిళా కళాశాల మొదటిస్థానంలో ఉందని ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు అన్నారు. కళాశాలలో 'నూతన జాతీయ విద్యావిధానం-20' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును గురువారం నిర్వహించారు. ముందుగా విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మైథిలి, డాక్టర్ తమరాన సింహాచలం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మహిళా కళాశాల వరుసగా మూడుసార్లు నాక్-ఎ గ్రేడ్ సంపాదించిందన్నారు. 2019లో స్వయం ప్రతిపత్తి సాధించిందని, అలాగే జోన్-1లోనే స్వయం ప్రతిపత్తిని సాధించిన ఏకైక కళాశాల అని పేర్కొన్నారు. ప్రత్యేకమైన రిస్ట్రక్టర్ కోర్సులనూ అందిస్తున్నామని తెలిపారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ సందర్భాన్ని పురుస్కరించుకుని ఐసిఎస్ఎస్ఆర్ ద్వారా వచ్చిన నిధులతో ఈ సదస్సు నిర్వహిస్తున్నామని అన్నారు. కళాశాల సీనియర్ అధ్యాపకులు డాక్టర్ డి.శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఉన్నత విద్యలో న్యూ ఎడ్యుకేషన్ పాలసీ విధానాలను పాటిస్తూ... నూతన పరిశోధనత్మక ప్రమాణాలను పాటించాలని అన్నారు. కో కన్వీనర్ కె.మౌనిక మాట్లాడుతూ ఐసిఎస్ఎస్ఆర్ నూతన జాతీయ విద్యా విధానం-20 అనే అంశం ప్రాధాన్యత తెలిసి నిధులను అందించాలన్నారు. అనంతరం నూతన జాతీయ విద్యా విధానం, దానివల్ల వచ్చిన మార్పులు, విద్యార్థులకు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయో తెలియజేశారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీరాములు

షోకాజ్ నోటీసులు అప్రజాస్వామికం

టెక్కలి: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొన్న ఎపిటిఎఫ్ రాష్ట్ర నాయకులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం అప్రజాస్వామికమని ఎపిటిఎఫ్ టెక్కలి మండల శాఖ గౌరవాధ్యక్షులు గున్న ప్రసాదరావు అన్నారు. అక్రమ షోకాజ్ నోటీస్‌లను నిరసిస్తూ గురువారం మండల రీసోర్సు కేంద్రం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గతంలో టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు చురుకుగా పాల్గొనేవారని అన్నారు. అది వారి కర్తవ్యంగా భావించి ప్రచారం చేపట్టేవారని, ఇప్పుడు అది నేరమంటే ఎలా అని ప్రశ్నించారు. ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గున్న ప్రసాదరావు, ఎన్.సురేష్‌కుమార్, వజ్జ ఆదినారాయణ, చిన్నారావు, కృష్ణమూర్తి, వాణయ్య, మార్పు నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు


హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన అధికారులు

పాలబంద చెరువు వద్ద హెచ్చరిక బోర్డు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని పాలబంద చెరువు వద్ద రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 26న 'పాలబంద చెరువు గర్భం ఆక్రమణ' అన్న శీర్షికతో ప్రజాశక్తి కథనాన్ని ప్రచురించింది. ఈ కథనానికి అధికారులు స్పందించి అక్కడి ఆక్రమణలను తొలగించారు. అనంతరం కృష్ణాపురం రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 129లో 5.27 ఎకరాలు ప్రభుత్వ భూమి అని, దీనిని ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీకుంటామని తహశీల్దార్ ఎస్.గణపతి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా వరుస కథనాలు ప్రచురితం కావడంతో అధికారుల్లో చలనం తీసుకొచ్చిన ప్రజాశక్తి పత్రికకు పలువురు ధన్యవాదాలు తెలిపారు.

పరస్పర సహకారం అవసరం


పోలీసు అధికారులతో ఆలయ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాలు విజయవంతానికి ఆలయ అభివృద్ధి కమిటీతో పాటు, పోలీసుశాఖ పరస్పర సహకారం అవసరమని సిఐ ఈశ్వర్ చంద్ర ప్రసాద్ అన్నారు. గురువారం గ్రామ దేవత ఆలయ ప్రాంగణంలో అభివృద్ధి కమిటీ సభ్యులతో సిఐ, ఎస్ఐ గోవిందరావు సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ 17 నుంచి మే 15వ తేదీ వరకు పట్టణంలో గ్రామ దేవత ఉత్సవాలు విజయవంతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు కావాల్సిన బందోబస్తు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. పట్టణంలో ఎక్కడా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి, పోలీసు బందోబస్తు ఎంత మందిని ఏర్పాటు చేయాలో చర్చించారు. కమిటీ సభ్యుల గతంలో చేసిన ఏర్పాట్లు, ఉత్సవాలు జరిగే తీరుతెన్నులు గురుంచి వివరించారు. ఎటువంటి అవాంచనీయ ఘటనలు తలెత్తకుండా గట్టి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. గ్రామ దేవత ఉత్సవాలు సందర్భంగా పట్టణంలో భారీ వాహనాల రాకపోకల పై అంక్షలు ఉంటాయని, ఆర్టీసీ కాంప్లెక్స్ వరకే ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు రాకపోకలు సాగించాలని అన్నారు.వైద్య శిబిరాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యశోదలక్ష్మి

'పోస్కో' చట్టంపై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మహిళల భద్రతకు ప్రభుత్వాలు అనేక రక్షణ చట్టాలు తీసుకొచ్చాయని, అందులో పటిష్టవంతమైన పోస్కో చట్టం గురించి ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులం ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి పేర్కొన్నారు. కళాశాలలో పోలీసుశాఖ ఆధ్వర్యాన కళాశాలలో స్ఫూర్తి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికలపై, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపుల నుంచి తమను తాము రక్షించుకునేందుకు వీలుగా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పోస్కో చట్టం మహిళలకు రక్షణ కవచంలా ఉంటుందన్నారు. పోలీస్ హెడ్ కానిస్టేబుల్ శాంతి బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. అలాగే టోల్‌ఫ్రీ నంబరు 1098, 100, 112 గురించి తెలియజేశారు. కార్యక్రమంలో కె.రామారావు, కె.వాసుదేవరావు, ఎం.రామకృష్ణ, పి.పద్మ, సిహెచ్.ఉష, జి.భార్గవి పాల్గొన్నారు.

అందుబాటు ధరలో 'ఈ-ఔషధి'

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రోగులకు మందుల ధరలు అందుబాటులో ఉండే విధంగా ఈఔషధి ఎంతగానో తోడ్పడుతోందని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. ఈఔషధి ఐదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని రెడ్‌క్రాస్ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈఔషధిపై వారం రోజుల పాటు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అన్ని మందులూ నాణ్యత కలిగి సరసమైన ధరలకు అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం నిత్యావసర మందులైన సుగర్, బిపి, గ్యాస్ట్రిక్, ఇతర దీర్ఘకాలిక రోగాలకు అవసరమైన మందులు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కె.సత్యనారాయణ, ఎ.నర్సింగరావు, పి.చైతన్యకుమార్, బి.శ్రీధర్, చిన్మయిరావు, తాతయ్య, బి.సతీష్, బేగం, ప్రియాంక, జగదీష్, పవన్ పాల్గొన్నారు.


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జగన్మోహనరావు

క్రైమ్ కార్నర్


సుదర్శన్ మృతదేహం

వ్యక్తి అనుమానాస్పద మృతి

బూర్జ : మండలంలోని ఎబిసి పేట (కొంంపేట) సమీపంలో ఉన్న తోటలో గురువారం మధ్యాహ్నం ఇదే మండలానికి చెందిన నీలంపేటకు చెందిన జమాన సుదర్శన్ (32) అనుమానాస్పదస్థితి మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... తోటతో మృతదేహం ఉందని గ్రామస్తుల సమాచారం మేరకు ఎస్ఐ అశోక్‌బాబు పరిశీలించారు. మృతదేహంపై గాయం ఉండడంతో అనుమానాస్పదస్థితిలో మృతి చెంది ఉంటాడని తెలిపారు. శవపంచనామా అనంతరం పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కొద్ది రోజులుగా ఈ తోటలో పేకాట ఆడుతున్నారని, ఈ సమయంలో ఎవరో హత్య చేసి ఉంటారని గ్రామస్తులు గుసగుసలాడుకుంటున్నారు. ఏది ఏమైనా రెండు గ్రామాల్లో విషాద ఛాయలు అలకున్నాయి.

వ్యక్తి ఆత్మహత్య

కోటబొమ్మాళి: మండలంలోని తిలారు గ్రామానికి చెందిన సమీన చిన్నవాడు(64) బుధవారం రాత్రి మద్యం మత్తులో మద్యం అనుకొని గడ్డిమందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను భార్య గవరమ్మ చూసి గ్రామస్తుల సహకారంతో నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. గురువారం ఉదయం 10గంటలకు ఆయన పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఎఎన్ఎం మృతి


పద్మావతి (ఫైల్)

కోటబొమ్మాళి: మండలంలోని నారాయణవలస గ్రామ పంచాయతీ తుంబయ్యపేట ఎస్‌సి కాలనీకి చెందిన ఎఎన్ఎం గంగారపు పద్మావతి(40) విద్యాఘాతంతో మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. పద్మావతి తన పెద్ద కుమారుడు కార్తిక్‌ని నారాయణవలస శివాలయం వద్ద బస్సు ఎక్కించి, ఇంటికి వచ్చింది. స్నానం చేసేందుకు విద్యుత్ హీటర్‌ను ఆన్‌చేయగా షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త అప్పన్న కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పద్మావతి జలుమూరు మండలం తలితిరియాలో ఎఎన్ఎంగా పనిచేస్తోంది. వీరికి ఇద్దరు కుమారులు ప్రసాద్, కార్తిక్ ఉన్నారు. అప్పన్న ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.మహ్మద్ అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


క్షతగాత్రులను పరామర్శిస్తున్న గౌతు శిరీష

కుక్కల దాడిలో ముగ్గురికి తీవ్ర గాయాలు

పలాస, వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండలం బెండి కాలనీలో గురువారం ఉదయం కుక్కల దాడిలో ముగ్గురు వృద్ధులకు తీవ్ర గాయాలయ్యాయి. రెండు పాడి ఆవులు గాయపడ్డాయి. వివరాలిలా ఉన్నాయి. బెండి కాలనీకు చెందిన పోలాకి లచ్చమ్మపై కుక్క దాడి చేసింది. కాలు, తొడపై కరవడంతో గాయపడ్డాయి. అనంతరం పుణ్యవతి, శివరాములు కాలిపై కరవడంతో వారు గాయపడ్డారు. అదే గ్రామానికి చెందిన అల్లాడ లక్ష్మీనారాయణ, మరో పాడి రైతుకు చెందిన ఆవులపై దాడి చేసి, గాయపర్చాయి. క్షతగ్రాతులను పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు.

గౌతు శిరీష పరామర్శ

కుక్కల దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పరామర్శించారు. ఆమె వెంట టిడిపి నాయకులు ఎల్.కామేశ్వరరావు, పి.విఠల్‌రావు, జి.సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బి.నాగరాజు, డొక్కారి శంకర్, టి.ధనుంజయ, తదితరులు ఉన్నారు.

10లోగా మహిళా మార్టును ప్రారంభించాలి

డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్


మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్

కోటబొమ్మాళి: ఈ నెల 10వ తేదీలోగా కోటబొమ్మాళిలో మహిళా మార్టును ప్రారంభించాలని డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్ అన్నారు. గురువారం వెలుగు అధికారి ఎస్.శ్రీరాములు తోకలిసి మహిళా మార్టు ఏర్పాటు కో సం పాత మహిళా సమాఖ్య భవనాన్ని పరిశీలించారు. అనంతరం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ ఆధ్వర్యాన వెలుగు సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మార్టు ఏర్పాటు చేసి కల్తీలేని నిత్యావసర సరుకులు మహిళా సంఘాల ద్వారా ప్రజలకు తక్కువ ధరకు అందజేయాలని పీడీ తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం కె.రాము, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న రామారావు

ముమ్మరంగా ప్రచారం

కవిటి: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మండలంలో జోరందుకుంది. ఓ వైపు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థులు ముమ్మర ప్రచారం చేస్తుండగా, మరో వైపు స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి పోటీ ఏర్పడడంతో అభ్యర్థులు ప్రచారం ప్రారంభించారు. అందులో భాగంగా గురువారం నెలవంక శ్రీ వెంటేశ్వరస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన నర్తు రామారావు నెలవంక, కపాసుకుద్ది, డొంకురు, బూర్జపాడు తదితర గ్రామాల్లో ముమ్మర ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నర్తు నరేంద్ర, తడక జోగారావు, యశోదమ్మ, ఇప్పిలి కృ ష్ణారావు, ఉప్పాడ నారాయణమ్మ, నూతలపాటి బాబురావు, పూడి నేతాజీ, సల్లా సుగుణ దేవరాజు, కడియాల పద్మ, కడియాల ప్రకాష్, కారింగి మోహనరావు, పూడి లక్ష్మణరావు, పూడి నీలాచలం, పిట్టా మామయ్య, పులకల శ్రీరాములు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

లోకేష్ పాదయాత్రలో రామ్‌మల్లిక్


లోకేష్‌తో నడుతున్న రామ్‌మల్లిక్

రణస్థలం రూరల్ : చంద్రగిరి నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర నిర్వహిస్తున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు గురువారం కలిశారు. అనంతరం లోకేష్‌తో కొద్దిసేపు పాదయాత్రలో పాల్గొన్నారు. టిడిపి బలోపేతం, పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

లావేరు : మండల కేంద్రం లావేరులోని విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ వెంకటరమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. 33 కెవి లావేరు విద్యుత్ ఉప కేంద్రంలో 5 ఎంవిఎపిటి ఆర్‌ను అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మన్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. లావేరు సెక్షన్ పరిధిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని చెప్పారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు, రైతులు గమనించి సహకరించాలని కోరారు.

నీటి సరఫరాలో ఇబ్బందులుంటే తెలపాలి

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో రానున్న వేసవిలో నీటిఎద్దడి లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని, తాగునీటి వనరుల వినియోగంలో ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే తక్షణమే తెలియజేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ టి.శ్రీనివాసప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీటి సరఫరాలో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తినా, అంతరాయం ఏర్పడినా 9100120604 నంబరుకు తెలియజేయాలని సూచించారు. ఉదయం 9 నుంచి రాత్రి ఏడు గంటల వరకు ఈ నంబరుకు సమాచారం తెలియజేయాలన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఐతమ్ 'యాస్పైర్ 2కె 23' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఏటా నిర్వహించే 2022-2023 'యాస్పైర్ 2కె 23ను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించే యాస్పైర్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. టెక్నికల్ సింపోజియమ్‌కు వివిధ కళాశాలల విద్యార్థులను 'పేపర్' ప్రజంటేషన్, 'ప్రాజెక్ట్ ఆవిష్కరణ'లు చేసేందుకు ఆహ్వానించామని అన్నారు. ఇప్పటివరకు ఎపి, తెలంగాణ, ఒడిశా, తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాల్లో ఉన్న ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 704 మంది విద్యార్థులు ఇప్పటికే తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. 20కు పైగా అద్భుత ప్రాజెక్ట్ ఎక్స్‌పోలకు, ఇతర ప్రతిభా పోటీలకు రూ.5లక్షలకుపైగా విలువైన నగదు బహుమతులను ప్రకటించామని విద్యార్థులు ఈ అద్భుత అవకాశాన్ని వినియోగించుకోవాలని డైరెక్టర్ కోరారు. సందేశాత్మక ఉపన్యాసాలతో పాటు క్రీడల్లో, పాఠ్యాంశాల్లో అత్యంత ప్రతిభ కనపరిచే విద్యార్థులకు బంగారు, వెండి పతకాలతోపాటు ఐతమ్ చైర్మన్ డాక్టర్, కొంచాడ సోమేశ్వరరావు ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఏటా భాగ్యలక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇచ్చే రూ.1.50లక్షలకు పైగా పారితోషికాలను విద్యార్థులకు అందజేస్తారని డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు పేర్కొన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, యాస్పైర్ 2కె 23 కన్వీనర్ సిఎస్ఇ హెచ్ఒడి డాక్టర్ యు.డి.ప్రసన్న, కో-కన్వీనర్లు డాక్టర్ పి.శ్రీహరి, డాక్టర్ బి.రమేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జీడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి


మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

జీడి మామిడి రైతులు యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని బాపట్ల జీడి మామిడి పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త ఉమా మహేశ్వరరావు అన్నారు. గురువారం అమలపాడులో సర్పంచ్ దున్న రత్నంబాలరాజు అధ్యక్షతన వజ్రపుకొత్తూరు ఉద్యానవనశాఖ అధికారి సునీత ఆధ్వర్యంలో రైతులకు జీడి మామిడి సాగుపై శిక్షణిచ్చారు. ఆయన మాట్లాడుతూ జీడిమామిడి సాగు వివరాలు, ఎరువుల యాజమాన్య పద్ధతులు, కొమ్మ కత్తిరించడం, సంకరజాతి రకాలు అంటు మొక్కల ఎంపిక, నీటి యాజమాన్యం, మొక్కనాటే విధానం, ఇతర సాంకేతిక పద్ధతులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు వివరించారు. కీటక శాస్త్రవేత్త నాగేంద్రరెడ్డి మాట్లాడుతూ కాండం, వేరు తొలుచు పురుగులు, తేయాకు దోమ, ఇతర పురుగులు యాజమాన్య పద్ధతులను వివరించారు. అనంతరం శాస్త్రవేత్తలు, రైతులతో కలిసి జీడి తోటలను పరిశీలించారు. కార్యక్రమంలో అమలపాడు, రేయిపాడు, పాత టెక్కలి గ్రామాలకు చెందిన రైతులు, సర్పంచ్ దున్నరత్నం, బాలరాజు, ఎంపిటిసి దున్న వీరాస్వామి, ఉద్యానవనశాఖ అధికారులు, సునీత, శంకర్ దాస్ పాల్గొన్నారు.



పెద్దబాల శిక్ష పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

పెద్దబాల శిక్ష పంపిణీ

టెక్కలి: మండలంలోని తలగాం ఎట్ నౌపడ ఆర్ఎస్ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో చదువుతున్న 15 మంది విద్యార్థులకు బిగ్ హెల్ప్ అసోసియేషన్ ఆధ్వర్యాన గురువారం పెద్ద బాలశిక్షను పంపిణీ చేశామని ఆ సంస్థ చైర్మన్ ఎన్.కృష్ణారావు, డైరెక్టర్ రామముని రమేష్‌కుమార్ తెలిపారు. నాటి చదువులకు కీలకమైన గ్రంథం పెద్ద బాలశిక్ష మాత్రమేనని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ధర్మారావు, మోహనరావు, శ్రీనివాసరావు, నీలమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బిఎస్ఎన్ఎల్ టవర్ వద్ద అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని అక్కివరం పంచాయతీ కొత్త రోడ్డు కూడలి వద్ద ఉన్న బిఎస్ఎన్ఎల్ టవర్ వద్ద గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు విపరీతంగా చెలరేగి దట్టమైన పొగలు కమ్ముకోవడంతో అటువైపుగా వెళ్లే వారు, చుట్టు పక్కల ఉన్న ప్రజలు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. గుర్తు తెలియని వ్యక్తి సిగరెట్ కాల్చివేసి లోపల వైపు విసిరివేయడంతో ఎండిన ఆకులు, రెల్లి పొదకు మంటలు వ్యాపించి ఈ సంఘటన జరిగిందని సిబ్బంది తెలిపారు. మంటలు భారీగా వ్యాపించడంతో లోపల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఒక్కసారిగా ఉలిక్కిపడి రోడ్డుపైకి పరుగులు తీశారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు శకటంతో సంఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. మంటలు అదుపులోకి రావడంతో సిబ్బంది, చుట్టుపక్కల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. సెల్ టవర్ కింద ఉన్న కేబుల్ వైర్లు కాలిపోయి రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించిందని, సిగ్నల్ వ్యవస్థలకు ఎటువంటి ఇబ్బంది లేదని బిఎస్ఎన్ఎల్ సబ్ డివిజనల్ ఇంజినీర్ పేడాడ రాజశేఖర్ తెలిపారు.

నీలగిరి, టేకు తోటలు దగ్ధం

పొందూరు: మండలంలోని నందివాడలో గురువారం మధ్యాహ్నం సంబంధించిన అగ్నిప్రమాదంలో గ్రామానికి చెందిన మజ్జి సన్యాసినాయుడు, ముల్లు రామకృష్ణలకు చెందిన టేకు, నీలగిరి తోటలు దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు నిర్లక్ష్యంగా నిప్పు పడేయడంతో ఐదెకరాలు విస్తీర్ణంలో గల ఈ తోటలకు మంటలు అంటుకుని కాలిపోయినట్లు అనుమనిస్తున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు.


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది


అన్నదానం చేస్తున్న అప్పలసూర్యనారాయణ

తారకరత్నకు నివాళి

శ్రీకాకుళం అర్బన్ : సినీ నటుడు నందమూరి తారకరత్న ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందడం ఆయన అభిమానులకు, తెలుగుదేశం పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ అన్నారు. నగరంలోని హెల్పింగ్ హాండ్స్ అనాథ బాలల వసతిగృహంలో తారకరత్న అభిమాన సంఘం ఆధ్వర్యాన గురువారం సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం అనాథ బాలలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తారకరత్న అకాల మృతి నందమూరి కుటుంబ సభ్యులతో పాటు పార్టీ కేడర్‌కు తీవ్రంగా కలచి వేసిందన్నారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, జిల్లా తారకరామ, మోక్షజ్ఞ సేవా సంఘం అధ్యక్షులు డేవిడ్ నౌపద సత్యనారాయణ, సురేంద్ర, సుభాష్, రాజు, ఆది, సురేష్, భాస్కర్, దేవా, దిలీప్, దుంగ శ్రీధర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తులసీదాస్‌రెడ్డి

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఇచ్ఛాపురం: పట్టభద్రులు తమ ఓటు హక్కును సద్వినియోగించుకోవాలని స్వర్ణభారతి విద్యా సంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం తమ విద్యా సంస్థలో సేవలు అందిస్తున్న 57 మంది పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 13న ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వీరిలో పది మంది ఒకసారి ఓటు హక్కును వినియోగించుకున్నారని చెప్పారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ ఫణీంద్రకుమార్

వంద రోజులు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్క కుటుంబానికి వంద రోజులు ఉపాధి కల్పించాలని ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మార్చి 31వ తేదీ నాటికి ప్రతి కుటుంబానికీ వంద రోజులు పని దినాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించాలని, కూలీలు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిడి బి.మురళీకృష్ణ, ఎపిఒ అరుణ్‌కుమార్, జెఇ జి.హరిప్రసాద్, క్లస్టర్ జెఇ పి.నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఇఒ మృతి బాధాకరం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కోటబొమ్మాళి మేజరు పంచాయతీ ఇఒ రఘుపాత్రుని యోగేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు బోయిన నాగేశ్వరరావు అన్నారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో యోగేశ్వరరావు సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. అనంతరం పంచాయతీ కార్యాలయం నుంచి రైతు బజారు వరకు యోగేశ్వరరావు అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఫణీంద్రకుమార్, దుక్క రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'అక్షయపాత్ర' ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని రెల్ల వీధిలో ఉన్న షిరిడి సాయి ఆలయంలో ప్రసాద వితరణ కోసం అక్షయపాత్రను డిపిఆర్ఒ బాలమాన్‌సింగ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారుల్లో నైతిక విలువలు, సేవాభావం పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రతిఒక్కరూ తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం డిపిఆర్ఒకు శేషవస్త్రాన్ని అర్చకులు అందజేశారు. కార్యక్రమంలో శాసపు జోగినా యుడు, శివానీ విద్యాసంస్థల అధినేత దుప్పల వెంకటరావు, డాక్టర్ మనోజ్, ఆలయ ధర్మకర్త శివాజీ పాల్గొన్నారు.

ఆత్మ రక్షణపై అవగాహన

పాలకొండ రూరల్ : ఆకతాయిల దాడి నుంచి తమను తాము ఎలా రక్షించుకోవాలో జిల్లా దిశ పోలీసు స్టేషన్ ఎస్ఐ రేవతి విద్యార్థిను లకు వివరించారు. పట్టణంలోని వెంకంపేట ఎంపియుపి పాఠశాలలో గురువారం విద్యార్థినిలకు పలు అంశాలను వివరించారు. సెల్ఫ్ డిఫెన్స్, దిశా యాప్ గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్, ఎస్ఒఎస్, పిల్లలపై లైంగిక వేధింపులు, తననుతాను ఎలా రక్షించుకోవాలనే అంశాలపై చక్కటి ఉదాహరణలతో చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ కానిస్టేబుల్ బి.సంధ్యారాణి, పాఠశాల హెచ్ఎం జి.పరంకుసంనాయుడు, సైన్స్ ఉపాధ్యాయుని వి.నాగమణి ఉన్నారు.

పెద్దపాడు రోడ్డులో విస్తరణ పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని పెద్దపాడు రోడ్డులో విస్తరణ పనులు చేపట్టాలని అధ్యయన వేదిక అధ్యక్షులు బి.వి.రవిశంకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెదరుగుతున్న జనాభాకు అనువుగా రోడ్ల విస్తరణ చేపట్టాలన్నారు. ప్రధానంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు ప్రవేశించే పెద్దపాడు రోడ్డు విస్తరణకు నోచుకోకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. పెద్దపాడు రోడ్డును 60 అడుగులు వెడల్పు చేస్తూ గతంలో పనులు చేపట్టారన్నారు. కానీ, పెద్దపాడు గ్రామం మధ్యలో వెళ్లే ఈ రోడ్డును విస్తరించకుండా 40



నిలిచిన వాహనాలు

అడుగులకే సరిపెట్టేశారన్నారు. మరో వైపు ఈ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. తక్షణమే ఆక్రమణలు తొలగించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు.

నైపుణ్యాభివృద్ధితో మెరుగైన ఉపాధి


మాట్లాడుతున్న అప్పలనాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నైపుణ్యాభివృద్ధి మెరుగుపరచుకునేందుకు విద్యార్థులు మెలకువలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందని సెట్‌శ్రీ మేనేజర్ వి.వి.అప్పలనాయుడు అన్నారు. పెద్దపాడులోని

సెట్‌శ్రీ మేనేజర్ అప్పలనాయుడు

అంబేద్కర్ గురుకులంలో యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యాన విద్యార్థులకు ఓరియంటేషన్ తరగతులను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెరుగుతున్న పోటీని తట్టుకునేందుకు వీలుగా నైపుణ్యాభివృద్ధిని సాధించుకున్నప్పుడే ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు పొందవచ్చన్నారు ప్రధానంగా విద్యార్థులు ఆత్మవిశ్వాసం, మనోనిబ్బరం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యశోద లక్ష్మి, ఎల్.ఎల్.నాయుడు, యూత్ సర్వీసెస్ జెఎ కె.గీత పాల్గొన్నారు.

రోడ్డును బాగు చేయరూ..

కవిటి: మండలంలోని నెలవంక నుంచి బూర్జిపాడు వెళ్లే రహదారి గోతులమయమైందని, తక్షణమే బాగు చేయాలని స్థానికులు వాపోయారు. గురువారం ఎఎంసి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి, ఆర్అండ్‌బి జెఇ మోహనరావు వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. రహదారి బాగోక పోవడం వల్ల గర్భిణులు, బాలింతలు ఆస్పత్రికి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారని అన్నారు. ఎఎంసి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి మాట్లాడుతూ నెలవంక నుంచి బూర్జపాడు వెళ్లే రహదారి అధ్వానంగా ఉందని,


గోతులు ఏర్పడిన రహదారిని చూపిస్తున్న స్థానికులు

గ్రామస్తుల సౌకర్యార్థం తక్షణమే రహదారి నిర్మాణం చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దీనిపై తక్షణమే ప్రజాప్రతినిధులతో మాట్లాడి రహదారి నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు.

ఎస్‌టి ధ్రువీకరణపై విచారణ

ప్రజాశక్తి- సీతంపేట

ఎస్‌టి ధ్రువీకరణ పత్రాలు పొందినట్లు వచ్చిన ఆరోపణలపై గురువారం ఐటిడిఎ పిఒ బి.నవ్య విచారణ చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా పొలాకి మండలానికి చెందిన పాకోటి వెంకట రఘురాం అనే వ్యక్తి ఎస్‌టి ధృవీకరణ పత్రం పొందారని, వాబ యోగేశ్వరరావు చేసిన ఫిర్యాదు మేరకు పిఒ విచారణ నిర్వహించారు. ఆరోపణలు ఎదుర్కొన్న వారిని, ఫిర్యాదు చేసిన వారిని పిఒ విచారించారు. ఇరువర్గాలు సమర్పించిన ఆధారాలను పరిశీలించారు. మరిన్ని ఆధారాల కొరకు చింతపల్లి తహశీల్దార్‌కు, చింతపల్లి గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు లేఖలు రాసి ఆధారాలు సేకరించాలని సిబ్బందికి ఆదేశించారు. తదుపరి విచారణ తేదిని మరలా తెలియజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీడీ బి నగేష్, ఏపీవో రోసిరెడ్డి, పొలాకి తహశీల్దార్ శ్రీరాములు, కోటబొమ్మాలి డిప్యూటీ తహశీల్దార్ ఆర్.మధు, ఆర్.ఐ శివరామకృష్ణ, సూపరిండెంట్ దేశ్, సీనియర్ అసిస్టెంట్ హరగోపాల్ పాల్గొన్నారు

వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలు

ప్రజాశక్తి - పాలకొండ

జగనన్న పాలకొండ అర్బన్ లే అవుట్ (నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు) లుంబూరు వద్ద గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని స్థానిక నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు సూచించారు. ఈ మేరకు గురువారం స్థానిక నగర పంచాయితీ కార్యాలయ ప్రాంగణంలో వార్డు సెక్రటరీలు, వాలంటీర్లు, హౌసింగ్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేలా ప్రణాళిక సిద్ధం చేసుకుని ఉగాది నాటికి లబ్దిదారులు నూతన గృహాల్లో ఉండాలనే ప్రభుత్వం చిత్త శుద్ధి ప్రాప్తికి లబ్దిదారులంతా శ్లాబులు, ప్లాస్టరింగ్ కిటికీలు మొదలగు పనులు పూర్తిచేసేలా చూడాలన్నారు. సచివాలయం వారీగా గృహ లబ్ధిదారుల వివరాలతో ఇళ్ల స్టేజ్ అప్డేషన్ గూర్చి పూర్తి వివరాలను సమీక్షించారు. లబ్దిదారులకు సకాలంలో బిల్లులు చెల్లింపు జరుగుతున్నాయని, కేవలం చివరి దశలో రూ.10వేలు ఖర్చుతో మిగిలిన గృహ నిర్మాణ పనిని పూర్తి చేస్తే రూ.30వేలు లబ్దిదారుని అకౌంట్‌లో జమ అవుతాయన్నారు. గృహ నిర్మాణ మేస్త్రీలతో కలిసి త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. సచివాలయ సిబ్బంది లబ్దిదారులకు పూర్తి అవగాహన కల్పించి గృహ నిర్మాణాలు శతశాతం పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. గృహ నిర్మాణాలకు యంత్రాంగమంతా అన్ని వసతులు కల్పిస్తున్నందున లబ్దిదారులంతా వారి గృహ నిర్మాణాలు ఉత్సాహంగా పూర్తిచేయాలన్నారు. లబ్దిదారులంతా ఈ సదవకాశాన్ని వినియోగించుకుని గృహాలను నిర్మించుకోవాలన్నారు. సిబ్బంది పూర్తి నిబద్దతతో పనిచేసి నిర్మాణదారులకు వచ్చే సందేహాలను నివృత్తి చేసి నిర్మాణాలు వేగవంతమయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

మహిళల్లో చైతన్యం తీసుకురావాలి

టెక్కలి: మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో నున్న మహిళల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు న్యాయవాదులు న్యాయ సేవాసాధికార సభ్యులు కృషి చేయాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి టి.హరిత ఆన్నారు. గురువారం బార్ ఆసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులతో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా బాల్య వివాహాలు జరుగుతున్నాయని, చట్టాలపై ఆవగాహన లేదన్నారు. లైంగిక వేధింపులు, గృహ హింస చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన అవసరమని అన్నారు. మార్చి 8వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఈ అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. సమావేశంలో బార్ ఆసొసియేషన్ అధ్యక్షులు ధర్మరాజు, ప్యానల్ అడ్వకేట్, న్యాయవాదులు ఖజానా వెంకటరావు, పి.ఆజాద్ పాల్గొన్నారు.


నాట్య ప్రదర్శనకు సిద్ధమవుతున్న కళాకారులు

శ్రీశైలంలో నృత్య ప్రదర్శనకు అవకాశం

ఇచ్ఛాపురం: పట్టణానికి చెందిన శ్రీ స్వేచ్ఛా నృత్య తరంగిణి కూచిపూడి భరతనాట్యం, జానపద నాట్య శిక్షణాలయం కళాకారులకు అరుదైన అవకాశం లభించింది. శ్రీశైలం దేవస్థానంలో ధర్మాపథం నిత్యకళారాధన సాంస్కృతిక కార్యక్రమంలో నృత్య కళాకారులు కూచిపూడి నాట్య ప్రదర్శనకు ఆహ్వానం అందినట్లు అకాడమీ అధ్యక్షులు తెలిపారు. ఈ నెల 4వ తేదీ శనివారం రాత్రి 6గంటల నుంచి నత్య ప్రదర్శన చేయనున్నారని గురువారం చెప్పారు. నృత్య ప్రదర్శనకు మంగి దివ్య, కె.కుమార్, కె.సూర్య, బి.భవానీ, పి.సంగీత, జి.భార్గవి, పి.వర్షిత, ఎస్.భార్గవి, పి.శ్రీహిత, టి.లహరి పయణమయ్యారు. వీరిని కళాభిమానులు అభినందించారు.

ఎమ్మెల్యే పరామర్శ

మెళియాపుట్టి: మండలంలోని మెళియాపుట్టి, వసుంధర గ్రామాల్లో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం పర్యటించారు. రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ భానుప్రకాష్‌రెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆమె బాధిత కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. వసుంధర గ్రామానికి చెందిన సలాన ఎరుకునాయుడు మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లన బాలరాజు, బి.ఉదయ్‌కుమార్, జై.మునిరావు, గణేష్ ప్రధాన్, వైసిపి నాయకులు ఉన్నారు.

రామకృష్ణ అరెస్టు సరికాదు

శ్రీకాకుళం అర్బన్ : పేదల కోసం పోరాటం చేస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను అరెస్టు చేయడం సిగ్గుమాలిన చర్య అని ఆ పార్టీ సీనియర్ నాయకులు సనపల నర్సింహులు ఒక ప్రకటనలో ఆక్షేపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిపిఐ ఆధ్వర్యాన విజయవాడ ధర్నా చౌక్‌లో తలపెట్టిన ధర్నాను అడ్డుకోవడం సరికాదన్నారు. పేదల నుంచి డిపాజిట్లు సేకరించి ఐదేళ్లుగా పంపిణీ చేయని టిడ్కో ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు ఇవ్వాలన్నారు. జగనన్న కాలనీ పేరుతో నిర్మిస్తున్న ఇళ్లకు ప్రభుత్వం కనీసం రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు టిడ్కో ఇళ్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ నాయకుల అరెస్టులను ప్రజాస్వామ్య వాదులు ఖండించాలని పిలుపునిచ్చారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

వంగర: గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని చీపురుపల్లి ఇఇ జి గౌరీ శంకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాలు ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న పనులు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజాం నియోజకవర్గంలో 3,454 గృహాలు మంజూరు కాగా ఇందులో వంగర మండలానికి సంబంధించి 1750 గృహాలు మంజూరయ్యాయని తెలిపారు.